క్లుప్తంగా

కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు



వెల్దుర్తి గ్రంథాలయంలో కథల పుస్తకాలను చదువుతున్న చిన్నారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ద్వారా చిన్నారులకు అన్ని రకాలు పుస్తకాలతోపాటు ఆటపాటల నిర్వహణ, అలాగే చిన్నారుల్లోని నైపుణ్యాలను వెలికితీస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కవితాబాయి తెలిపారు. సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం చిన్నారులకు జానపద సాహిత్యాన్ని పరిచయం చేశారు. చిన్నారులు అందమైన బొమ్మలు వేసి వారి ప్రతిభను చాటారు.

రక్తదాతకు సన్మానం



ఎస్కే గిరితో పాటు రక్తదాతలను సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: 22 సార్లు రక్తదానం చేసిన హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కే గిరికి లెజెండ్ ఉత్తమ ప్రాణదాత సేవ పురస్కార్ వరించింది. మంగళవారం గుంతకల్ పట్టణంలోని జరిగిన లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ మొదటి వార్షికోత్సవంలో ఎస్కే గిరికి గుంతకల్ మున్సిపాల్ వైస్ చైర్మన్ నైరుతి చేతుల మీదుగ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రంజాన్, హనుమంతు, రాము, బోనాల ప్రకాష్, తిప్పన్న పాల్గొన్నారు.

నీళ్ల ట్యాంకుల ఏర్పాటు



ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో తేరు బజారు కాలనీలో నీటి సమస్య ఉందని గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు బోరు వేయించి రూ.3 లక్షలతో రెండు ట్యాంకులు, పైపులైను వేసి మోటారు అమర్చి నీటిని సరఫరా చేసి నీటి సమస్య పరిష్కరించినట్లు సర్పంచు కారుమంచి మల్లికార్జున మంగళవారం తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో హరిజన రంగస్వామి అనే వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి పేరిట వైఎస్సార్ బీమా నమోదై వుండడంతో గ్రామ కార్యదర్శి సుధాకర్, సంక్షేమ అధికారి సంధ్యారాణి జిల్లా అధికారులకు తెలియజేసి తక్షణ సాయం కింద భార్య ప్రభావతికి రూ. 10 వేలు అందజేశారు. మిగతా సొమ్ము నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరిజన రంగస్వామి ఉన్నారు.

వలంటీర్ పోస్టుకు ఇంటర్వ్యూ

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహమూర్తి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక పోస్టుకు ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారని, అయితే ఇద్దరు మాత్రమే ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. ఎంపికైన వారిని త్వరలోనే ప్రకటించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థినులు

ఎమ్మిగనూరుటౌన్: అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఈటా నగర్‌లోని సిద్ధార్థ స్టేడియంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన 2వ జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్ షిప్ 2023 పోటీల్లో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. వివిధ రాష్ట్రాల నుంచి 88 మంది క్రీడాకారులు పాల్గొనగా.. 14 సంవత్సరాల్లోపు విభాగంలో స్థానిక ఎంఎస్ బాలికల హైస్కూల్‌కు చెందిన ముందరింటి దక్షిత, బోయ సుమిత్ర, ముందరింటి మోక్షిత, అంజుం ఖుషి సిల్వర్ మెడల్స్ సాధించారు. ఇదే పోటీలో మిక్స్‌డ్ డబుల్ విభాగంలో పట్టణానికి చెందిన ముందరింటి మోక్షిత, నెల్లూరుకు చెందిన్న వైభవ్‌ల జట్టు సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు. 18 సంవత్సరాల విభాగంలో ఉప్పర హారిక, బోయ వైశాలి, 14 సంవత్సరాల విభాగంలో కనికె జ్యోతి, సుచిత్రలు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌసియాబేగం, పీడీలు నాగేశ్వరి, సుజనలు మంగళవారం తెలిపారు.

ఖరీఫ్ సాగుకు విత్తనాలు సిద్ధం

- వ్యవసాయ పనుల్లో రైతన్నలు నిమగ్నం
- ఆర్బీకేల్లో అందుబాటులో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు
- నమోదు ప్రక్రియ ప్రారంభం
- అవసరమైన మేరకు పంపిణీకి చర్యలు



ఆలూరు వద్ద కాడెద్దులతో పొలంలో దుక్కి దున్నుతున్న రైతు

ఆలూరు: ఖరీఫ్ పంటల సాగుకు ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. గత మూడు రోజుల నుంచి నియోజకవర్గంలో కురుస్తున్న వర్షాలకు ఎర్రనేలల్లో రైతన్నలు లోతైన దుక్కిదున్నుతూ వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తూ బాసటగా నిలుస్తోంది.

మండలం	ఖరీఫ్ సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ప్రతిపాదించిన విత్తనాలు (క్వింటాళ్లలో)	మంజూరైన విత్తనాలు (క్వింటాళ్లలో)
ఆలూరు	2,200	670	520
ఆస్పరి	3,550	2740	1050
చిప్పగిరి	200	130	80
హాలహర్వి	1,500	340	190
హొళగుంద.	15,050	560	150
దేవనకొండ	7,400	750	250

బెట్టను తట్టుకునే రకాలు..

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో దాదాపు 35 నుంచి 82 వేల హెక్టార్లలలో ఖరీఫ్ సీజన్లో వివిధ రకాల పంటలను వర్షాధారంగా సాగు చేస్తారు. కాగా సబ్ డివిజన్ పరిధిలో అధికంగా కే-6, ధరణి, కే-9 తదితర రకాల వేరుశనగ విత్తనాలు బెట్టకు తట్టు కుంటాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ఆరు మండలాల పరిధిలో రైతులు సమారు పది వేల హెక్టార్లకు గాను 5,190 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాగా మొదటి విడతగా ఇప్పటి వరకు 2240 క్వింటాళ్లు మంజూరయ్యాయి. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా విత్తనాలు నిల్వ ఉంచుతామని అధికారులు చెబుతున్నారు. ఇంకా రైతులు పేర్లు నమోదు చేసుకుంటే ఇండెంట్ పెట్టి అవసరమైన విత్తనాలు తెప్పిస్తామని పేర్కొంటున్నారు.

క్వింటా రూ. 5,580 లకు పంపిణీ

క్వింటా వేరుశనగ మార్కెట్ రూ 9,300 కాగా 40 శాతం సబ్సిడీ ధర రూ. 5,580 లకు రైతులకు ప్రభుత్వం రైతులకు ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకూడా ప్రారంభమయ్యింది. పలు చోట్ల పంపిణీ కూడా ప్రారంభించారు. అంతేకాకుండా రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, దేవనకొండ, హాలహర్వి మండలాలలో పనిచేస్తున్న ఏఓలు, ఎంపీఈఓలు, కార్యాలయ సిబ్బంది నకిలీ విత్తుపై ప్రత్యేకంగా నిఘా వేయాలని ఏడీఏ సునిత ఆదేశించారు.

రాయితీపై విత్తనాలు అందించడం సంతోషకరం



ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రాయితీ వేరుశనగ విత్తనాలు అందజేయడం సంతోషకరం. ఇప్పకిటే ఆర్బీకేలో విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకున్నాం. ఖరీఫ్ సీజన్‌కు 15 రోజులు ముందుగా విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తే శుద్ధి చేసుకోవడానికి వీలుంటుంది.

- ఈరన్న, హత్తిబెళగల్ గ్రామ రైతు

ఖరీఫ్ దగ్గరపడుతుంది



ఖరీఫ్ సీజన్‌కు గడువు దగ్గర పడుతుంది. వరుణ దేవుడు కరుణిస్తే విత్తనాలు వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందడంతో పాటు డబ్బులు కూడా ఆదా అవుతాయి. దీనికి తోడు వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు ఇస్తారు.

- మల్లన్న గౌడ్ ,మొలగవల్లి గ్రామ రైతు

ఆర్‌బీకేలలో వేరుశనగను అందుబాటులో ఉంచుతాం



వ్యవ సాయ సబ్ డివిజన్‌కు వేరుశనగ విత్తనాన్ని ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచుతాం. 10,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కావాలని జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు గత నెలలోనే పంపాం. అదేవిధంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 76 ఆర్‌బీకేల్లో 10.935 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, ఎంపీఓ, కాంప్లెక్స్ తదతర ఎరువులు, మునుము, కంది, పెసర, జొన్న, కొర్ర, సజ్జ సబ్సిడీ విత్తనాలను 5 వేల క్వింటాళ్లను మంజూరుకు ప్రతి పాదనలు అందజేశాం. -సునిత ఏడీఏ , ఆలూరు

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



కృష్ణగిరిలో రైతులకు వేరుశనగ విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ డాక్టర్ వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసే రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి సూచించారు. మండల కేంద్రమైన కృష్ణగిరిలో మంగళవారం ఆయన ఏఈఓ రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రాయితీ వేరుశనగ విత్తనాలను రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను గ్రామస్థాయిలోనే రైతులకు అందిస్తుందని దళారులను నమ్మి ఎవ్వరు మోసపోవద్దని కోరారు. విత్తనాలు ఇంకా అవసరమైతే ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ద్వారా జిల్లా అధికారులకు తెలియజేసి అదనపు స్టాక్ తెప్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, ఎంపీటీసీ సభ్యురాలు మహాలక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏపీఎం మహేశ్వరయ్య, వీహెచ్‌ఏ సుకన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడి, శ్రీనాథ్‌రెడ్డి, బాలు, దస్తగిరి, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజారెడ్డికి నివాళి

పత్తికొండ రూరల్ : స్థానిక శారద వృద్ధాశ్రమంలో వైఎస్.రాజారెడ్డి వర్ధంతిని సేవాదళ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మాజీ ఉపసర్పంచు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అనిత, సరోజ దివంగత వైఎస్. రాజారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు లైట్ నాగరాజు, రాజేశ్వరి, మాజీ ఎంపీటీసీ గణపతి, చక్రాళ్ల లక్ష్మికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఎంపిక

ఆలూరు రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ముగ్గురు విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు. హొళగుంద మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన శ్రావణి 600/569 మార్కులు సాధించి ప్రథమ స్థాయిలో ఎంపికైంది. హాలహర్వి మండలం చింతకుంట గ్రామ జెడ్పీ పాఠశాల విద్యార్థి శ్రీనివాసులు 600/566 మార్కులతో రెండో స్థానం కైవసం చేసుకున్నాడు. ఆలూరు మోడల్ పాఠశాలకు చెందిన తస్లీమ్ 600/563 మార్కులతో మూడో స్థానంలో నిలిచింది. నియోజవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు మొదటి బహుమతి కింద రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందించనున్నారు. బుధవారం ఆలూరులోని ఆర్టీటీ భవన్‌లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నారని ఆయా మండల ఎంఈఓలు తెలిపారు.



శ్రావణి, శ్రీనివాసులు, తస్లీమ్

వేరుశనగ విత్తనాల పంపిణీ

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని రైతు భరోసా కేంద్రం-1లో మంగళవారం రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో వెంకట్రాముడు మాట్లాడుతూ మండల రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు తీసుకుని పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్వింటా పూర్తి ధర రూ.9,300 కాగా ప్రభుత్వం రూ.3720 రాయితీ ఇవ్వగా రైతు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్ధ ఎకరాకు ఒక విత్తన సంచి, యకరా లోపల ఉంటే 2 విత్తన సంచులు రాయితీపై ఇవ్వబడుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రియాజ్‌బాషా, వీఏఏ శ్రీనాథ్ పాల్గొన్నారు.

11 వందల క్వింటాళ్ల విత్తనాలు మంజూరు

ఆస్పరి: ఖరీఫ్ సీజన్‌కు మండలానికి 11 వందల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని ఏఓ మునెమ్మ మంగళవారం తెలిపారు. మండలంలోని ఆస్పరి, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, బిణిగేరి, బిల్లేకల్లు, ముత్తుకూరు, కై రుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు గ్రామాల రైతులకు సబ్సిడీ కింద వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయా గ్రామాల రైతులు వేరుశనగ విత్తనాల కోసం ఆర్బీకే కేంద్రాల్లో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి ఆలయ ప్రారంభోత్సవం

వెల్దుర్తి (కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని మహిమాన్విత బ్రహ్మగుండం క్షేత్రంలో శాంత చౌడేశ్వరి అమ్మవారికి నూతనంగా నిర్మించిన గుడి ప్రారంభ అభిషేకోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మగుండేశ్వరిస్వామి గుడి ఎదురుగా తేరు (రథం) వద్దకు వెళ్లే దారిలో నాగుల కట్ట, శాంత చౌడేశ్వరి అమ్మవారు వెలసి ఉండగా వారికి దాదాపు రూ.5లక్షలతో గుడి నిర్మించారు. దేవస్థానం ఆలయ ఈఓ హనుమంతరావు, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డిల ఆధ్వర్యంలో వెల్దుర్తి మండల పరిధిలోని నార్లాపురానికి చెందిన పూజారి వెంకట సుబ్బయ్య (శాస్త్రి) కుమార్తె పూజారి భవాని సొంత ఖర్చులతో దాదాపు ఏడాది క్రితం గుడి నిర్మాణానికి పూనుకున్నారు.. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన భర్త సుధాకర్‌తో కలిసి మంగళ వారం గుడి ప్రారంభోత్సవం నిర్వహించారు. ముందుగా కామేశ్వరీదేవిసమేత బ్రహ్మగుండేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతన గుడిలో శాంత చౌడేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారి భవాని సుధాకర్ దంపతులు

సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

మద్దికెర : ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ సవిత సూచించారు. మొదటి సంవత్సరం ఇంటర్ ఉదయం 8:30 నుంచి 12 గంటల వరకు, అలాగే సెకండ్ ఇంటర్ మధ్యాహ్నం 2:00 నుంచి 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 282 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు.

రైతు భరోసా అర్హుల జాబితా ప్రదర్శన

చిప్పగిరి: కొత్తగా రైతు భరోసాకు అర్హులైన జాబితాను ఆయా గ్రామాల ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు ఏఓ ఆనంద్ మంగళవారం తెలిపారు. ఈ సంవత్సరం కొత్తగా రైతు భరోసాకు మండలంలోని 13 పంచాయతీ పరిధిలో 149 మంది అర్హత పొందారని చెప్పారు. గతంలో అర్హత పొందిన వారికి యథావిధిగా రైతు భరోసా సాయం అందుతుందని తెలిపారు. రైతులు తమ పరిధిలోని ఆర్బీకేలకు వెళ్లి పేర్లు చూసుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మద్దికెర : మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే షాపు సీజ్ చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని ఏఓ హేమలత హెచ్చరించారు. మంగళవారం ఏఓ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వున్నందువల్ల ఎక్కువగా మిరప, పత్తి పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధపడుతున్నారన్నారు. రైతులు కూడా విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు.

రేపటితో ముగియన్న దరఖాస్తు గడువు

కృష్ణగిరి: కృష్ణగిరిలోని మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25తో గడువు ముగుస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి మంగళవారం తెలిపారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అలాగే ఇంటర్ ప్రవేశాలకు కూడా జూన్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీఎం జగనన్నతోనే పేదల సంక్షేమం



హోసూరులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- హోసూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పత్తికొండ రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సారథ్యంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని హోసూరు గ్రామంలో సచివాలయం-2 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన గ్రామస్తులకు బుక్‌లెట్‌లను పంపిణీ చేసి వివరించారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పథకాలు పొందాలంటే అనేక పైరవీలు ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇంటివద్దకే సంక్షేమ పథకాలు దరిచేరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ పార్థసారథి, హోసూరు సర్పంచు నాగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారంనాగరాజు, శ్రీనివాసులు, మోహన్, ఎంపీటీసీలు కేశప్ప, నెట్టేకల్, శాంతిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో కుక్కల వీరంగం

- వివిధ ప్రాంతాల్లో 14 మందికి కుక్కకాటు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం 11 మంది కుక్క కాటుకు గురికాగా, మరో ముగ్గురు గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. చిన్న పిల్లలను రోడ్డు మీదకు పంపాలంటేనే భయపడుతున్నారు. పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన సరస్వతి(12 సం), సంధ్య(6), పుష్పావతి(12), లక్ష్మీపేట షరీఫ్(36), ముగతిపేటకు చెందిన మల్లికార్జున(12), శాంతినగర్‌కు చెందిన విజయకుమారి(32), టీబీపీ కాలనీకి చెందిన రాజు(25), మహబుబ్‌నగర్‌కు చెందిన వీరేష(6), కలుగోట్ల రోడ్డుకు చెందిన సోహెల్(20), 12వ వార్డుకు చెందిన హర్షవర్ధన్(18), కిషోర్‌లు కుక్కగాటుకు గురి అయ్యారు. అలాగే ఎమ్మిగనూరు మండలం కడిమెట్లకు చెదిన కవిత(13), బిందులత(12), మల్కాపురంకు చెందిన అంథోనమ్మ(63)లు కుక్క కాటుకు గురయ్యారు. సోమవారం ఒక్క రోజే పట్టణంలో ప్రాంతాలకు చెందిన 22 మంది కుక్క కాటుకు గురైనట్లు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది తెలిపారు.

కౌలు కార్డులు ప్రయోజనకరం

ఆలూరు రూరల్: భూమి కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసే ప్రతి రైతు కౌలు కార్డు కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఆలూరు ఏడీఏ సునీత అన్నారు. కార్డు పొందిన కౌలు రైతుకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 ,ఈ క్రాప్ నమోదుతో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కొనుగోలు, ఉచిత పంటల బీమా, మద్దతు ధర, పంట రుణాలు, వ్యవసాయ పథకాలు అందుతాయన్నారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

దేవనకొండ: మండలం పరిధిలో వివిధ గ్రామాల్లో కౌలు రైతులు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సురేష్‌బాబు తెలిపారు. స్థానిక ఆర్‌బీకేల్లో కౌలు రైతులు అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే సీసీఆర్‌సీ గుర్తించి కార్డులను మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి
- అట్టహసంగా వలంటీర్లకు వందనం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతోప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తూ ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ వారధుల్లా పనిచేస్తూ దేశంలో ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. పట్టణంలోని ఉప్పర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం పట్టణంలో ఉత్తమ సేవలందించిన వార్డు వలంటీర్లు సున్నంబట్టీ వీధికి చెందిన పింజరి నజ్మకు సేవా వజ్ర అవార్డు, వీరేష్ బాబు, పీర్‌బాషా, సురేష్‌కుమార్, వసుంధర, గడిగె చంద్రకళకు సేవా రత్న అవార్డులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ప్రదానం చేసి సత్కరించారు. అంతకు మునుపు ఎమ్మెల్యే జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తూ ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు జవాబుదారితనంతో పని చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో గోనెగండ్ల ఎంపీపీ నసురుద్దీన్, కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు శివప్రసాద్, ఖాశింబేగ్, బజారి, డిష్ కేశవరెడ్డి, కోటకొండ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణగిరిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి



సున్నంబట్టీ వీధికి చెందిన పింజరి నజ్మను సేవా వజ్ర అవార్డుతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

మండల పరిషత్ కార్యాలయంలో

ఎమ్మిగనూరురూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాలకు చెందిన వలంటర్లీకు సన్మాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చేతుల మీదుగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేయటంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బంగారమ్మ, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్. బసిరెడ్డి, ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండల అధ్యక్షులు గొల్ల కేశన్న, నసురుద్దీన్, నాయకులు పేట శ్రీనివాసరెడ్డి, బందెనవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అమోఘమని గ్రామ సర్పంచ్ మునెమ్మ, పంచాయతీ కార్యదర్శి సుజాత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హాలహర్వి, గురజాల గ్రామాలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చేతుల మీదుగా సేవ మిత్ర పురస్కారాలు పొందిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురజాల సచివాలయ కార్యదర్శి విజేంద్ర, ఆయా గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కోతి ఈరన్న, తిమ్మప్ప, రమేష్, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమూల్యం

కృష్ణగిరి: ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ల సేవలు అమూల్యమైనవని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. కృష్ణగిరిలో వలంటీర్లకు మంగళవారం ఆయన ప్రభుత్వం ప్రకటించిన సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో పత్తికొండ మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మాధవరావు, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏపీఎం మహేశ్వరయ్య, సూపరింటెండెంట్ రామస్వామి, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, ఎంపీటీసీ సభ్యురాలు మహాలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

తుగ్గలి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను పర్జలకు చేరవేయడంలో వలంటీర్లు చేసిన సేవలే వారికి గుర్తింపు, పురస్కారాలు తెచ్చిపెడుతున్నాయని ఎంపీటీసీ సభ్యులు రాసులమ్మ, సుంకన్న, సచివాలయ కన్వీనర్లు బండ్లపల్లి వెంకటేష్, ఈశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ముక్కెల్ల, బొందిమడుగుల సచివాలయా ల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముక్కెల్లలో సేవా రత్నకు ఎంపికైన అటిక రంగస్వామితో పాటు, మిగిలిన వలంటీర్లను సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర, గిడ్డయ్య, గోవర్ధనరెడ్డి, రంగడు, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

దేవనకొండలో..

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో మంగళవారం గ్రామ వలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ఎంపీడీఓ గౌరీదేవి సమక్షంలో అందజేశారు. . కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, DHONE
EP. 93/2022 IN OS NO. 366/2018

Golla Somasekar, Aged about 52 years S/o Golla Krishnamurthi, Hindu, Agricultural R/o Bingidoddi (Village), Veldurthi (Ml), Kurnool (Dt) .. Decree Holder
-Vs-
N.Venkata Rami Reddy, Aged about 66 years S/o N.Venkata Reddy, Hindu, Business R/o S.Boyanapalli (Village), Veldurthi (Ml), Kurnool (Dt) .. JDr.

వేలము ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పైన కనపరిచిన డిక్రీ హోల్డర్ తనకు జడ్జిమెంట్ డెటార్ నుండి రావలసిన పై EP అమౌంట్‌ను రాబట్టుకొనుటకు ఈ క్రింద కనపర్చిన EP షెడ్యూల్ దాకలా ఆస్తిని 13-06-2023 ఉ॥ 10.30 గంటల నుండి సా॥ 5.00 గంటల లోపు పై కోర్టు నందు బహిరంగ వేలము వేయబడును. కావున కొనదలచిన వారు ఎవరైనా బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

షెడ్యూల్: The Land situated in Kurnool Division, Dhone Sub-division, Veldurthi Mandal with the limits of Narsapuram GramaPanchayath, Narasapuram Village, bearing Sy.No. 6 in the Extent A.C. 0.30 Cents

Boundaries: East: Pallapu Seenu S/o Pedda Beesanna Land, West: Jangam Sankaraiah S/o Chinna Rachaiah Land, North: Pallapu Sreenivasulu S/o Pallapu Naganna Land, South: N.Pullamma W/o Nursing Keshava Reddy Land.

DHR Value: 1,00,000/-
Ameena Value : 60,000/-
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది: 13-06-2023

గుజ్జం మనోహర్, అడ్వకేట్/ DHr, డోన్, సెల్: 99669 79941